క్లుప్తంగా

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కుందూ పరివాహక ప్రాంతంలో స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నంద్యాల పట్టణ పరిసరాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో గాలేరు, మద్దిలేరు వాగు పరిసరాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న కారణంగా వాగులు దాటరాదని వాహనదారులకు సూచించారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి.. ప్రజలకు అందుతున్న ఆహారాన్ని ఆయన పరిశీలించి, ఆహార నాణ్యతా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్ సిబ్బంది ఉన్నారు.

ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధం



మాట్లాడుతున్న ధనుంజయుడు

నంద్యాల(న్యూటౌన్): విద్యాలయాలు, దేవాలయాల ప్రాంతాల్లో మద్యం షాపులకు అనుమతులు ఇస్తే ప్రత్యక్ష ఉద్యమాలు చేస్తామని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ధనుంజయుడు, నాగరాముడు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారులు నిత్యం రద్దీగా ఉండే ప్రదేశాల్లో మద్యం షాపులకు అనుమతి ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా దేవాలయాల, పాఠశాలలు, కళాశాలలు ఉన్న ప్రాంతంలో మద్యం షాపులకు అనుమతి ఇవ్వవద్దని కోరారు. సమావేశంలో సురేష్, విష్ణు, ఎర్రిస్వామి, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కలుగొట్లపల్లె వద్ద వక్కిలేరు వాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మంజులవాణి

చాగలమర్రి: భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మంజులవాణి సూచించారు. బుధవారం మండలంలోని కలుగొట్లపల్లె గ్రామ సమీపంలో నున్న వక్కిలేరు, భవనాసి వాగులను సందర్శించి, నీటి ఉధృతిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భారీ వర్షపాతం నమోదవుతుండటంతో మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు ప్రవాహాల వద్దకు వెళ్లరాదని చెప్పారు. మట్టి మిద్దెల్లో నివసించేవారు జాగ్రత్తగా ఉండాలని, పూర్తిగా దెబ్బతిని ఉంటే వెంటనే ఖాళీ చేయాలన్నారు. కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఫైరోజ్ ఉన్నారు.

కార్యాలయాలకు వెళ్లేదెలా..?



కార్యాలయాల మధ్య నిలిచిన వర్షపునీరు

గోస్పాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్ మధ్య ఉన్న రహదారి చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి అధ్వానంగా మారుతోంది. వర్షం వచ్చిన ప్రతిసారి రహదారిపై మురుగు నీరు నిలుస్తోంది. దీంతో అధికారులు, కార్యాలయాల వద్దకు వచ్చే ప్రజలు తప్పని పరిస్థితిలో ఆనీటిలోనే వెళ్లాల్సి వస్తుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల కార్యాలయాల వద్దే ఇలాంటి దుస్థితి ఉంటే ఇక ప్రజల అవసరాలు, సమస్యలు ఏం పరిష్కరిస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మహానందీశ్వరుడి సేవలో టీపీడీసీ

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో టైగర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ కన్జర్వేటర్ కృష్ణమూర్తి బుధవారం పూజలు చేశారు. నూతనంగా వచ్చిన ఆయన ముందుగా కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్థానిక యాగశాలలో వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. అనంతరం నంద్యాలకు వెళ్లి బాధ్యతలు తీసుకున్నట్లు తెలిసింది.



క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది



దొర్నిపాడు: మొలకెత్తుతున్న మొక్కజొన్న కంకులు



ఉయ్యాలవాడలో కురుస్తున్న వర్షం



తోడేండ్లపల్లె గ్రామంలో కూలిన మట్టి మిద్దె



మాల వాగులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

కుండపోత

- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- తడి ఆరని పొలాలు, ఆందోళనలో రైతులు

దొర్నిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో జనం బయటకు వెళ్లలేని పరిస్థితి. బుధవారం ఉదయం నుంచి నిర్విరామంగా వర్షం కురుస్తుండటంతో మినుము, జొన్న, పత్తి, మిరప, కంది రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతింటాని రైతులు పేర్కొంటున్నారు. కాయలన్నీ నేల రాలుతుండటంతో సీడ్ పత్తి రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది. ఇక క్రిష్టిపాడు వద్ద కుందూనది బ్రిడ్జిపై ప్రవహిస్తూ ప్రమాదకరంగా మారింది. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని గ్రామ రెవెన్యూ అధికారి సాంబశివుడు సూచించారు. మండలంలో 19.8 మి.మీ., వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉయ్యాలవాడ : మండలంలో నాలుగు రోజుల నుంచి అల్పపీడన ప్రభావంతో వర్షం కురుస్తోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల దిగుబడులు చేతికందుతున్న తరుణంలో వర్షాలతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. మొక్కజొన్న, మినుము, కొర్ర, తదితర పంటలు పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. దిగుబడులు కళ్లాల్లోకి చేర్చారు. దిగుబడులు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడుతున్న అగచాట్లు వర్ణణాతీతం. అలాగే..రబీ సీజన్‌లో భాగంగా పప్పు శనగ సాగు చేసుకునేందుకు రైతులు భూమిలో రసాయనిక ఎరువులు విత్తారు. ప్రస్తుత వర్షాలు విత్తనానికి అనువుగా మారాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల నీరంతా కుందూ నదికి చేరడంతో ఉయ్యాలవాడ సమీపంలో నది ఉధృతంగా ప్రవహిస్తుంది.



ఇంజేడులో కల్లాల్లో మొక్కజొన్న దిగుబడులపై పట్టలు కప్పిన దృశ్యం

శిరివెళ్ల: మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రెండు రోజుల్లో 7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వర్షంతో శిరివెళ్ల– రుద్రవరం ఆర్అండ్‌బీ రస్తాలోని మాల వాగు, కోడిపిల్ల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. మండలంలో మినుము, మొక్కజొన్న పంటలకు వర్షం కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు. వర్షం కారణంగా మండల కేంద్రంలో పల్లె పండుగ కార్యక్రమం రద్దయ్యింది.



పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు



ఎర్రగుడిదిన్నె వద్ద వంతెనపై పారుతున్న నీరు

రుద్రవరం: మండలంలో నాలుగు రోజుల నుంచి వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తోంది. వాగులు వంకలు పొంగి ప్రవహించడంతో 21 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు సాగు చేసిన మినుము, మొక్క జొన్న, జొన్న పంటలు వందలాది ఎకరాల్లో నీటమునిగాయి. అలాగే రోడ్ల,బయలు ప్రదేశాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. రుద్రవరం–శిరివెళ్ల రహదారిలో నేల వంతెనలు ఉండటంతో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రగుడిదిన్నె వద్ద వక్కిలేరు వాగు వంతెనపై వర్షపు నీరు ప్రవహిస్తుంది.స్థానిక చాకలి కాలనీలో రెండు మట్టి మిద్దెల పైకప్పులు కూలాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. మాచినేనిపల్లె, పేరూరు,ఎర్రగుడిదిన్నె తదితర గ్రామాల పరిధిలో ఇటీవల రైతులు జొన్న పంట సాగు చేశారు. కురిసిన వర్షానికి మొలక దశలో ఉన్న జొన్న పైరు మొత్తం నీట మునిగింది. ఆరబోసిన మొక్క జొన్నలు తడిసి మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రుద్రవరం చాకలి కాలనీలో కూలిన మట్టి మిద్దె

కూలిన మట్టి మిద్దె, నేల వాలిన వృక్షాలు..

చాగలమర్రి: మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు కురిసిన భారీ వర్షానికి 67.4మి.మీ (6.7 సెం.మీ)ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. వర్షానికి వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండల కేంద్రంలోని పలు వీధులు, ప్రధాన రోడ్లు, ప్రభుత్వ కార్యాయాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూల తోటల్లో వర్షపు నీరు చేరడంతో పూలు కోయడానికి ఇబ్బందిగా మారింది. తోడేండ్లపల్లె గ్రామంలో శ్రీరాములు అనే వ్యక్తికి చెందిన మట్టిమిద్దె కూలింది. గొడిగనూరు గ్రామంలో కూడా మట్టి మిద్దెలు పాక్షికంగా దెబ్బతినగా, భారీ వృక్షం నేలకొరిగింది.



గొడిగనూరులో రహదారిపై కూలిన వృక్షం



చాగలమర్రి వైఎస్సార్ సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

దొర్నిపాడు: ఉపాధి హామీ పనుల్లో తప్పులకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా పీడీ జనార్దన్‌రావు సూచించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి బుధవారం స్థానిక వెలుగు కార్యలయంలో బహిరంగ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. రూ.2.80 కోట్ల పనులకు గాను గత వారం రోజులుగా తనిఖీ బృందం పనులపై విచారణ చేసి నివేదికను సమర్పించింది. పీడీ మాట్లాడుతూ 200 రోజుల ప్రణాళికను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి జాబ్‌కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని చెప్పారు. వలంటీర్లు మూడు రోజులకు మించి పనులకు వెళ్లనందున రూ.20,766 రికవరీ చేయాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ, పేస్లిప్‌ల పంపిణీ సరిగ్గా లేనందుకు సిబ్బందికి రూ.9,700 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంఅండ్ఈ ఏపీడీ భాస్కర్‌నాయుడు, ఏపీడీలు సాంబశివుడు, అన్వరబేగం, అంబుడ్స్‌పర్సన్ సురేంద్ర కుమార్, జిల్లా విజిలెన్స్ కమిటీ అధికారులు బాలజీనాయక్, షిబారాణి, ఎంపీడీఓ సావిత్రి, ఏపీఓ నాగన్న, ఈసీ సోమశేఖర్ పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్

నంద్యాల(న్యూటౌన్):ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆటో ట్రాలీ, ఫోర్ విల్లర్స్ డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ప్రశాంత్ పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాలలో వారు మాట్లాడుతూ డ్రైవర్ల జీవితాలతో చెలగాటం ఆడే భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్ 1,2లను రద్దు చేయాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, డ్రైవర్ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 19, 20 తేదీల్లో నంద్యాలలో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లు పాల్గొని విజయవంతం సభలను చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు ఆంజనేయులు, సునిల్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ఉయ్యాలవాడ : మండలంలో ఉపాధి హామీ పథకం కింద పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.14 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజ చేశారు. ఆర్.పాంపల్లె, కొండుపల్లె గ్రామాల్లో అంతర్గత రహదారుల్లో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు చాబోలు లక్ష్మిదేవి, ఇరిగెల లక్ష్మిపద్మజ, ఎంపీటీసీ సభ్యురాలు కపురం శివమ్మ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో బుధవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.35 లక్షలతో చేపట్టే పనులకు భూమిపూజ చేశారు.సర్పంచ్ పద్మిని, ఈఓపీఆర్డీ సులోచన, నాయకులు వెంకటనాయుడు, గంగవరం కృష్ణారెడ్డి, వరప్రసాద్, గోపాల్‌నాయుడు, సుబ్బయ్య, పీఆర్ ఈఏ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



చాకరాజువేములలో భూమి పూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, తోడేండ్లపల్లె, చక్రవర్తులపల్లె గ్రామాల్లో బుధవారం రూ.58 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎంపీడీఓ మంజులవాణి భూమి పూజ చేశారు. పంచాయితీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రదీప్ ఉన్నారు.

అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ నాయక్ వసీం

శిరివెళ్ల: తుపాన్ మూలంగా భారీ వర్షాలు పడుతున్నాయని, తాగునీరు, అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచులు ఎంపీటీసీలు సమస్యలపై సభలో గళమెత్తారు. కామినేనిపల్లె సర్పంచు చిన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపయోగంగా ఉన్న ఓ తరగతి గది కబ్జా అయిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నా వాటికి శాశ్వత భవనాలు లేవన్నారు. శిరివెళ్ల ఎంపీటీసీ యామా శ్రీనివాసులు మాట్లాడుతు బలిజపేట, ముబారక్ పేటల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయన్నారు. యర్రగుంట్ల ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి మాట్లాడుతు జాతీయ రహదారిపై పలు ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు సర్వీస్ రోడ్డుకు రాకుండా పోతున్నాయన్నారు. అలాగే ఈ ఖరీఫ్‌లో సాగుచేసిన మినుము పంట అతివృష్టికి దెబ్బతినిందని, నష్ట పరిహారం చెల్లించాలన్నారు. విద్యుత్ శాఖ పని తీరుపై ఎంపీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పురాతన విద్యుత్ స్తంభాలు తొలగింపు, నూతన స్తంభాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. తమ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వివరాలు తమకు చెప్పడం లేదని గుండంపాడు ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని చదివి వినిపించారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పైప్‌లైన్ల లీకేజీలను సత్వరమే సరి చేయాలన్నారు. మండలంలో వారం రోజుల పాటు పల్లె పండుగ కార్యక్రమం జరుగుతుందన్నారు. రూ. 1.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజలు జరుగుతున్నాయని చెప్పారు. తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

దొర్నిపాడు: చెడువ్యసనాలకు బానిసలై శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. బుధవారం రాత్రి చాకరాజువేముల, దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ యువత ఇటీవల ఆన్‌లైన్ గేమ్స్, రుణాలు పొంది వాటిని తిరిగి కట్టలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వారిపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. పిల్లల అలవాటల్లను గమనిస్తుండాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మట్కా, పేకాట, బెల్టుషాపులు నిర్వహిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

నంద్యాల: పట్టణంలోని చామకాల్వ రోడ్డుపై గుర్తు తెలియని కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాత్రి చామకాల్వ సెంటర్ వద్ద జూపాడుబంగ్లా మండలం లింగాపురం గ్రామానికి చెందిన సోలోమెన్(65) నడుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోలోమెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున తెలిపారు.

కొనసాగుతున్న 'పల్లె పండుగ'

గోస్పాడు: గ్రామాల్లో పల్లె పండుగ–పంచాయితీ వారోత్సవాలు బుధవారం గోస్పాడు, ఒంటివెలగల గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. గోస్పాడులో రూ.35లక్షలతో 700 మీటర్లు, ఒంటివెలగలలో రూ.15లక్షలు నిధులతో 300 మీటర్ల సీసీ రహదారులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్‌డీఓ నాగఅనసూయ తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలకు సూచనలిస్తున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

నంద్యాల(వ్యవసాయం): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి సూచించారు. గురువారం స్థానిక సబ్‌జైలును జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలిసో తెలియకో తప్పు చేసి ఉండొచ్చన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని జీవితంలో మంచి పనులు చేస్తూ పదిమందికి ఆదర్శంగా నిలవాలన్నారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలన్నారు. ఏవైనా లీగల్ సమస్యలు ఉంటే సబ్ జైలులో లీగల్ ఎయిడ్ అడ్వకేట్ ఉంటారని, వారు సమస్యలను ఉచితంగా పరిష్కరించేందుకు సహకరిస్తారని చెప్పారు. ఆరోగ్య సమస్యలు ఉంటే డాక్టర్ జైలుకు వచ్చి మీకు చికిత్సలు అందజేస్తారన్నారు. జైల్‌లోని రికార్డులను పరిశీలించి జైలు సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ అడ్వకేట్ బాలునాయక్, లీగల్ సెల్ సిబ్బంది రామచంద్రారెడ్డి, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

ఆళ్లగడ్డ: ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలావెంకటశేషాద్రి తెలిపారు. బుధవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ కేసుల్లో, ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జైలు అధికారి వెంకటసుబ్బన్న, న్యాయవాదులు మోహన్, షహీనా ఉన్నారు.

ట్రాన్స్ జెండర్లకు సమాన అవకాశాలు కల్పిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: సమాజంలో పురుషులు, స్త్రీలతో పాటు ట్రాన్స్‌జెండర్లకూ సమాన అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో ట్రాన్స్ జెండర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు మెరుగైన జీవితాన్ని గడిపేందుకు పురుషులు, స్త్రీలతో సమాన అవకాశాలు కల్పిస్తూ ఉపాధి మార్గాలు చూపిస్తామన్నారు. జిల్లాలో 240 మంది పెన్షన్ పొందుతున్నట్లు, వైద్య శాఖ నివేదికల్లో 690 మంది ఉన్నట్లు, ఎన్జీఓ సంస్థలు వెయ్యి మంది ఉన్నట్లు రకరకాల గణాంకాలు చెబుతున్నారని, నిజమైన ట్రాన్స్‌జెండర్ల జాబితాను సమర్పించాలని సంబంధిత ఎన్జీఓ సంస్థలను, అధికారులను ఆదేశించారు. గతంలో తాను పనిచేసిన జిల్లాలలో ట్రాన్స్ జెండర్ల సమస్యలు తన దష్టికి వస్తే సంబంధిత అధికారులతో వాళ్లు నివసిస్తున్న కాలనీలకు వెళ్లి లబ్ధి చేకూర్చామని చెప్పారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

జిల్లాలో 42 మంది హెచ్ఐవీ పేషెంట్లు ఉన్నారని, ట్రాన్స్ జెండర్లు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. అందరికీ రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి గల వృత్తులపై నైపుణ్యాలు పెంపొందించి, బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యాలు కూడా కల్పిస్తామన్నారు. ఆసుపత్రిలో ప్రత్యేక ఓపీ బ్లాక్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నూతన పాలసీ ప్రకారం జిల్లాలోని ట్రాన్స్‌జెండర్‌ల అందరికీ గృహాలు కేటాయిస్తామన్నారు. సమావేశంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రయీస్ ఫాతిమా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ శారదాబాయి, సివిల్ సప్లయ్స్ అధికారి వెంకట్రాముడు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో అనస్తీషియా వైద్యులు కీలకం



అవగాహన కరపత్రాలు విడుదల చేస్తున్న నంద్యాల అనస్తీషియా వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): వైద్య రంగంలో అనస్తీషియా వైద్యుల పాత్ర కీలకమని జాతీయ అనస్తీషియా వైద్యుల సంఘం నంద్యాల శాఖ అధ్యక్షుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, అనస్తీషియా వైద్యుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ మధుసూదన రెడ్డి అన్నారు. అక్టోబర్ 16 ప్రపంచ అనస్తీషియా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ అనస్తీషియా వైద్యుల సంఘం నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక అనస్తీషియా వైద్యుల సంఘం కార్యాలయంలో బుధవారం శస్త్ర చికిత్సలలో, అత్యవసర చికిత్స వార్డులలో అనస్తీషియా వైద్యుల పాత్ర గురించి అవగాహన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అనస్తీషియా శస్త్ర చికిత్సల పరిధి విస్తృతం కావడానికి, వినూత్న శస్త్ర చికిత్సల ప్రక్రియలకు నాంది పలికిందన్నారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సలు మెదడు, గుండె, లివర్, కిడ్నీలకు చేయడానికి అనస్తీషియా రంగంలో వచ్చిన నూతన పరికరాలు, రోగి స్థితి గతులను నిరంతరం గమనించే పరికరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో అనస్తీషియా వైద్యులు నాగరాజారెడ్డి, శేషఫణి, మహబూబ్ బాషా, నాగరాజు, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



ఎస్.కొత్తపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ : తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య సూచించారు. బుధవారం మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్కువశాతం దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిచామన్నారు. జ్వరాలు సోకిన వారు నిర్లక్ష్యం వహించకుండా సమీపంలో వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందాలని కోరారు. సాయంత్రం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.